ప్రభాత సూర్యుడు
తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 57, EDITOR:CHERUKU UPENDAR, DATE : TUESDAY 20 JUNE 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 57, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 20 జూన్ 2023 పేజీలు : 4 వెల : 5/-

జూలై 12న చంద్రయాన్

నెల్లూరు- ప్రభాత సూర్యుడు

ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగానికి సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ల్యాండర్, రోవర్, ఉపగ్రహానికి సంబంధించిన ఫొటోలను ఇస్రో ఇటీవలే విడుల చేసింది. జులై-12న ఈ ప్రయోగం చేపట్టాల్సి ఉంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం

మిగతా 3లో...

అనూహ్యంగా
సెకండ్‌లోకి కాంగ్రెస్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కర్ణాటక ఎన్నికల ఫలితాల తరువాత తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. బీజేపీ స్పీడ్ తగ్గితే... కాంగ్రెస్ దూకుడు పెరిగింది. రాష్ట్ర స్థాయిలో బీఆర్ఎస్ స్వరం కూడా మారింది. ఇలా గత కొన్ని రోజులుగా తెలంగాణ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాల వెనుక గల ఆంతర్యమేంటో ఆ వివరాలపై ఓ లుక్కేయండి. ఇదొక్కటి అనే కాదు.. గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ టార్గెట్ గా కేసీఆర్ విమర్శలు చేస్తున్నారు. ధరణిని తీసివేస్తామన్న కాంగ్రెస్ ను బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిస్తున్నారు. మె?న్నటి వరకు బీజేపీ ధోరణి, బీజేపీ లీడర్లపై విరుచుకుపడే బీఆర్ఎస్ నేతలు కూడా... ఇప్పుడు డైవర్షన్ తీసుకుని కాంగ్రెస్ పార్టీపైనే ప్రధానంగా దృష్టి పెడుతున్నారు. దీనికి గల కారణం ఏంటంటే... కర్ణాటకలో విజయంతో తెలంగాణ కాంగ్రెస్ లో జోష్ వచ్చింది. బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా ఉన్న నాయకుల్ని చేర్చుకోవంలో కాంగ్రెస్ పార్టీ సక్సెస్ అవుతోంది. ఈ తరుణంలో బలమైన క్యాడర్ లేని బీజేపీ కంటే.. కాంగ్రెస్ తోనే ఎక్కువ ప్రమాదమని బీఆర్ఎస్ గుర్తించి నట్లుంది. అందుకే కాంగ్రెస్ పై

మిగతా 2లో...

పక్కాగా ప్రణాళికలు
అధికారమే లక్ష్యం..!

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.. మూడో సారి విజయం సాధించేందుకు పక్కాగా ప్రణాళికలు వేసుకుంటున్నారు. అక్టోబర్‌లో ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అభ్యర్థుల జాబితాను ఖరారు చేసి ప్రకటించాలని అనుకుంటున్నారు. కనీసం మూడు నెలల ముందు ప్రకటించడం ద్వారా అభ్యర్థులు పూర్తి స్థాయిలో ప్రజల్లోనే ఉండేలా అవకాశం కల్పించాలనుకుంటున్నారు. లాస్ట్ మినిట్ లో ఎవరైనా వెనుకబడినట్లుగా అనిపిస్తే కొత్త వారికి బీ ఫాం ఇవ్వవొచ్చన్న ప్లాన్ లో ఉన్నట్లుగా చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాల పర్యటనలకు వెళ్లినప్పుడు ఎవరికి టిక్కెట్లు ఉంటాయో.. ఎవరికి ఉండవో.. కేసీఆర్ ఇచ్చే ప్రాధాన్యం బట్టి వారికి అక్కడి ఎమ్మెల్యేలకు క్లారిటీ వస్తోందంటున్నారు. 2018లో ముందస్తు అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లిన కేసీఆర్.. ప్రభుత్వ రద్దు ప్రకటనతోపాటే ఆ

మిగతా 2లో...

గవర్నర్ కోట భర్తీకి
సర్కార్ మీన మేషాలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాజ్‌భవన్, ప్రగతి భవన్ మధ్య గ్యాప్ అంతకంతకూ పెరుగుతోందే తప్ప ఏ మాత్రం సెట్ అవుతున్న సూచనలు కనిపించడం లేదు. పెండింగ్ బిల్లులకు ఆమోద ముద్ర కోసం ఏకంగా సుప్రీం కోర్ట్ తలుపుతట్టాల్సి రావడంపై ఇప్పటికీ రగిలిపోతున్నాయట ప్రగతి భవన్ వర్గాలు. అంతకు ముందు, ఆ తర్వాత కూడా రెండు పవర్ సెంటర్స్ మధ్య మాటల తూటాలు పేలుతూనే ఉన్నాయి. ఎవరికి అవకాశం వచ్చినప్పుడు వారు ట్రిగ్గర్

మిగతా 2లో...

మహేశ్వరం దాకా మెట్రో

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణకు హరితహారం తొమ్మిదో విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నేడు హరితోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే రంగారెడ్డి జిల్లా తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్ పార్కులో మొక్కను నాటి తొమ్మిదో విడత హరిత హారానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. గతంలో తాను హరితహారం అంటే నేతలు, అధికారులకు అర్థం కాలేదన్నారు సీఎం కేసీఆర్. హరితహారాన్ని చాలా మంది హస్యాస్పదం చేశారన్నారు. కాంగ్రెస్ నాయకులు అయితే జోకులు వేశారని గుర్తు చేశారు. కానీ హరితహారం ద్వారా రాష్ట్రంలో 7.7 శాతం పచ్చదనం పెరిగిందని చెప్పుకొచ్చారు. అన్ని రంగాల్లో తెలంగాణ నంబర్ వన్ గా

మిగతా 2లో...

ధరణి చుట్టూ
రాజకీయ పార్టీలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ధరణి పోర్టల్ అంశం ఈ మధ్య గట్టిగా చర్చకు వస్తోంది. రద్దు చేస్తామని ప్రతిపక్ష అంటే? అంతా బాగానే ఉందని ప్రభుత్వం పదే పదే చెబుతుంది. ఇది కాస్త ఎన్నికల వేళ.... తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారిపోయింది. ఈ విషయంలో బీజేపీ...వాదన మరోలా ఉంది.గత కొద్దిరోజులుగా తెలంగాణలో ధరణి పోర్టల్ అంశంపై గట్టిగా చర్చ వినిపిస్తోంది. ప్రతిపక్షాలతో పాటు కొన్ని ప్రజాసంఘాలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. అవన్నీ కేవలం ఆరోపణలు మాత్రమే అని అంటోంది ప్రభుత్వం. ఇక తాము అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ ను రద్దు చేస్తామని ప్రధాన ప్రతిపక్షం(కాంగ్రెస్) పదే పదే చెబుతుండగా... అలాంటి వారికి ప్రజలు అవకాశం ఇవ్వొద్దని కోరుతున్నారు గులాబీ బాస్ కేసీఆర్. ఇది కాస్త తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఎన్నికల వేళ ధరణి అంశం ఎవరికి ఆయుధం

మిగతా 3లో...

అవినాష్ బెయిల్ పై
సుప్రీం కోర్టులో వాదనలు

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

వివేక హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డికి, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో తెలంగాణ హైకోర్టు అవినాష్‌కు ముందస్తు బెయిల్ ఇచ్చింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన వివేక కుమార్తె సునీత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. హత్య

మిగతా 3 లో...

ఖమ్మంలో డ్రగ్స్
కేసు మూలాలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

హైదరాబాద్‌లో కలకలం రేపిన డ్రగ్స్ కేసు మూలాలు ఖమ్మంలో గుర్తించారు. ఇది కాస్తా బడా వ్యాపార వేత్తలు, ప్రముఖులు నివసిస్తున్న శ్రీరాం హిల్స్ పరిసర ప్రాంతాలకు పాకినట్లు తెలుస్తున్నది. ఖమ్మం నగరం శివారు ప్రాంతంగా ఉన్న శ్రీరామ్ హిల్స్‌ను కొంతమంది అక్రమ వ్యాపారాలు, భూ దందాలు వంటి మరెన్నో అసాంఘిక కార్యక్రమాలకు కేంద్రంగా మార్చుకున్నట్లు తెలుస్తున్నది. డ్రగ్ పెడ్లర్ కేపీ చౌదరి ఖమ్మంలో ప్రముఖులు నివాసం ఉండే

మిగతా 3లో...

పొలిటికల్ స్క్రీన్‌పై కొత్త చిత్రాలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ పొలిటికల్ స్క్రీన్‌పై కొత్త చిత్రాలు కనిపించబోతున్నాయా? పతంగి పార్టీ కేంద్రంగా పరిణామాలు మారుతున్నాయా? పాతబస్తీ దాటి ఆ పార్టీ బయటికి వస్తే?నష్టం ఎవరికి? ఒంటరిగా పోటీ చేసి ఓట్లు చీలిస్తే?దెబ్బ పడేది ఎవరికి? అసలు మజ్లిస్ అధినేత మనసులో ఏముంది? లెట్స్ వాచ్.ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టేది ఎంఐఎం. తెలంగాణ ఏర్పాటయ్యాక మిత్రులు మారిపోయి బీఆర్ఎస్‌తో దోస్తీ కుదిరింది. ఇన్నాళ్ళు ఆ మైత్రి కొనసాగుతూ వస్తోంది. అయితే.. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎంఐఎం వరుస సభలతో హడావిడి చేయడం, అందులోనూ ఇన్నాళ్లూ మిత్రత్వం కొనసాగించిన బీఆర్ఎస్ సర్కార్ మీద విమర్శలు, ఆరోపణాస్త్రాలను

మిగతా 2లో...

కాక రేపుతున్న పాదయాత్ర

నల్గోండ - ప్రభాత సూర్యుడు

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర నల్గొండ జిల్లాలో కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు విమర్శలు ఎక్కుపెట్టడంతో బీఆర్ఎస్ నేతలు ప్రతివిమర్శలు చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఒక వైపు కర్నాటక ఫలితాలు.. మరోవైపు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్

మిగతా 3లో...

3 నెలల ముందే
70 సీట్లు ప్రకటన

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

2024 ఎన్నికల్లో తెలంగాణలో అధి కారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తోంది. కర్నాటక ఎన్నికల్లో వచ్చిన జోష్‌తో తెలంగాణలోనూ సత్తా చాటాలని చూస్తోంది. ఇందులో

మిగతా 3లో...

అనూహ్యంగా

సెకండ్‌లోకి కాంగ్రెస్

(**మొదటిపేజీ తరువాయి**)

అస్త్రాలు ఎక్కుపెడుతోంది.తెలంగాణ కాంగ్రెస్ లో సరికొత్త జోష్ వచ్చింది. డీకే శివకుమార్– సిద్ధరామయ్యల స్ఫూర్తితో సీనియర్ లీడర్లు అంతా కలిసి పని చేస్తున్నారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలో రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అలా లీడర్లు అంతా కలిసి పాల్గొంటున్నారు. మరోవైపు.. ఆపరేషన్ కమలం పెద్దగా వర్కౌట్ అవకపోవడంతో ఆపరేషన్ హస్తం చేపట్టింది. ఇప్పటికే పొంగులేటి, జూపల్లి కృష్ణారావులు పార్టీలే చేరేలా మంతనాలు పూర్తి చేశారు. రేపో మాపో వారిద్దరు హస్తం గూటికి చేరనున్నారు. వీరితో పాటు నాగర్ కర్నూల్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత గుర్నాథ్ రెడ్డిలు సైతం హస్తం పార్టీకి టచ్ లో ఉన్నారు. మరోవైపు తాండురు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డితో విభేదాలు ఉన్న పట్నం మహేందర్ రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇలా బీఆర్ఎస్ కు ఎదుర్కోవాలంటే కాంగ్రెస్ పార్టీ వల్లే అవుతుందనే సంకేతం.. ఇతర పార్టీల్లోని నాయకులకు పంపిస్తున్నట్లైంది. కర్ణాటకలో మాదిరి సంక్షేమమే లక్ష్యంగా మ్యానిఫెస్టో తయారు చేస్తున్నారు. ధరణి తీసిస్తాం. 2 లక్షల వరకు రుణమాఫీ అంటూ రైతుల్ని ఆకర్షించే పనిలో పడ్డారు. అలాగే, మహిళలకు తెలంగాణ అంతటా ఉచిత బస్సు ప్రయాణం అంటూ మహిళలను కూడా ఆకర్షిస్తున్నారు. కాంగ్రెస్ హైకమాండ్ లోని ప్రియాంక గాంధీ తెలంగాణ పై ప్రత్యేక దృష్టి పెట్టింది. దీంతో.. ఈ సారి ఎలాగైనా అధికారంలోకి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది కాంగ్రెస్ పార్టీ. ప్రస్తుతానికైతే.. బీఆర్ఎస్ కాకపోతే అధికారంలోకి వచ్చే తామే అన్న భావనను జనాల్లోకి హస్తం పార్టీ గట్టిగానే తీసుకెళ్తుంది. ఇదే జోరు ముమ్ముందు కొనసాగితే... ఎన్నికల్లో ట్రై యాంగిల్ పోరు కాదు. కారు వెర్సస్ హస్తం యుద్ధమే జరగొచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

గవర్నర్ కోట భర్తీకి

సర్కార్ మీన మేషాలు

(**మొదటిపేజీ తరువాయి**)

నొక్కుతూనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లోనే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఆశావహులు నలిగిపోతున్నారట. గవర్నర్ కోటాలోని రెండు ఓఒఅ స్థానాలు మే చివర్లో ఖాళీ అయ్యాయి. మామూలుగా అయితే? ఏ ప్రభుత్వమైనా ఆ సీట్లను ఇన్నాళ్ళు ఖాళీగా ఉంచదు. రాజకీయ అవసరాలు, ఆశావహుల నుంచి వచ్చే వత్తిళ్ళతో ఖాళీ అవక ముందే కొత్త అభ్యర్థుల ఎంపిక జరిగిపోతుంది. కానీ? ఈసారి మాత్రం తెలంగాణలో పరిస్థితి భిన్నంగా ఉంది. రాజ్‌భవన్‌తో పెరిగిన గ్యాప్ దృష్ట్యా తాము ఎంపిక చేసిన అభ్యర్థులకు గవర్నర్ ఆమోద ముద్ర వేస్తారో, లేదోనన్న అనుమానం ప్రభుత్వ పెద్దల్ని వెంటాడుతోందట. అందుకే మీన మేషాలు లెక్కిస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. సాధారణంగా.. ఎంపిక చేసిన అభ్యర్థులకు కేబినెట్ మీటింగ్‌లో ఆమోద ముద్ర వేసి తర్వాత గవర్నర్‌కు పంపుతారు. అయితే ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో అసలు ఎమ్మెల్సీల ప్రస్తావనే రాలేదట. అనుమానాలు ఉంటే ఉన్నాయిగానీ? రెండు పదవులు ఖాళీ అయి ఇన్నాళ్ళయినా?ప్రభుత్వం ఇంత తాత్సారం చేయడం ఏంటని చేతులు నలుపుకుంటున్నారట ఆశావహులు.రాజ్ భవన్? ప్రగతి భవన్ మధ్య సంబంధాలు బాగా ఉన్నంత కాలం ఈ వ్యవహారమంతా గ్లాసులోని మంచినీళ్ళు తాగినంత తేలిగ్గా జరిగిపోయింది. గవర్నర్ కోటాలో ఒక పేరును కేసీఅర్ క్యాబినెట్ ప్రతిపాదించడం?ఆ పేరుకు రాజ్‌భవన్‌లో స్టాంప్ వేయడం చకచకా జరిగిపోయేవి. కానీ? ఇప్పుడు రెండు అధికార కేంద్రాల మధ్య అంతరం పెరిగిపోయి అనుమానాలు, భయాలు ఎక్కువ అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తాము ఎవరి పేరు ప్రతిపాదిస్తే.. గవర్నర్ ఏ రూపంలో అభ్యంతరం చెబుతారోనన్న ఆందోళన ప్రభుత్వ వర్గాల్లో ఉందన్న ప్రచారం జరుగుతోంది. పార్టీ నేతలు, సానుభూతి పరులను ప్రతిపాదించిన తరువాత అట్నుంచి రెడ్ సిగ్నల్ పడితే అనంతర పరిణామాలు ఎలా మారతాయోనని చర్చిస్తున్నారట గులాబీ పార్టీ అగ్రనాయకులు. ఒకవేళ తేడాపడితే? లేని సమస్యను కొని తెచ్చుకున్నట్టు అవుతుందన్న అభిప్రాయం బీఆర్ఎస్ వర్గాల్లో ఉందట. అందుకే ఏ మాత్రం తొందరపడకుండా? గవర్నర్ కోటా ఓఒఅల భర్తీ విషయంలో ఆచితూచి అడుగులు వేయాలని పార్టీ అగ్రనాయకత్వం భావిస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల హీట్ రోజు రోజుకు పెరుగుతున్న పరిస్థితుల్లో? ఆ రెండు ఎమ్మెల్సీ సీట్ల భర్తీ విషయంలో బీఆర్ఎస్ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తి అన్ని వర్గాల్లో పెరుగుతోంది.

పక్కాగా ప్రణాళికలు..

అధికారమే లక్ష్యం.!

(**మొదటిపేజీ తరువాయి**)

ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థుల పేర్లను కూడా ప్రకటించేశారు. అప్పుడు ఎన్నికలకు సుమారు మూడు నెలల ముందే ఒకేసారి 105 మంది జాబితాను విడుదల చేయడం సంచలనం సృష్టించింది. అదే తరహాలో ఈసారి అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించేలా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ కోసం బీఆర్ఎస్‌లో తీవ్రపోటీ నెలకొనడం, సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో పనిమంతులకే తిరిగి టికెట్ దక్కుతుందని ఇప్పటికే స్పష్టతనిచ్చారు. చివరి నిమిషంలో టిక్కెట్లు ఖరారు చేస్తే అసంతృప్తి ప్రభావం చూపిస్తుందని మూడు నెలల ముందుగానే చెబితే.. వెళ్లేవాళ్లు వెళ్తారని ఉండేవాళ్లు ఉంటారని అనుకుంటున్నట్లుగా బీఆర్ఎస్ ఉన్నత స్థాయి వర్గాలు చెబుతున్నాయి. మంచి ముహూర్తం చూసుకుని అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. జూలై మూడో వారం నుంచి నెలాఖరు మధ్యలో బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ఈ తొలి జాబితాలో సుమారు 90 మంది అభ్యర్థుల పేర్లు ఉండే అవకాశం ఉందని.. గణనీయంగానే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ల కోత పడొచ్చని ప్రచారం జరుగుతోంది. సుమారు 25 మందికి మళ్లీ పోటీచేసే అవకాశం దక్కకపోవచ్చని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. టికెట్ల కోసం పారీ?టలో తీవ్ర పోటీ ఉన్న సీట్లు, విపక్షాల ఎత్తుగడలు, ఇతర పారీ?టల నుంచి బలమైన నేతల చేరికకు అవకాశం ఉన్నచోట్ల ఎంపికను చివరి నిమిషం వరకు ఆపే అవకాశం ఉందని అంటున్నాయి. నలభై స్థానాల్లో పోటీ ఎక్కువగా ఉంది. ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లతోపాటు ఇతర ఆశావహులు కలుపుకొని సుమారు 70 మంది బలమైన నేతలు ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో టిక్కెట్లు లభించకపోతే కొంత మంది బయటకు వెళ్లిపోతారు. అభ్యర్థుల జాబితాను ముందస్తుగా ప్రకటించడం ద్వారా నష్ట నివారణ చర్యలు చేపట్టడం సులభం అమవుతుందని కేసీఆర్ అంచనా వేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడం ద్వారా అసంతృప్త నేతలను బుజ్జగించడం, సాధ్యంకాని పక్షంలో సాగనంపడ ం చేయాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ నుంచి ఇతర పారీ?టల్లోకి వెళ్లే అవకాశమున్న నేతల జాబితాను కేసీఆర్ సిద్ధం చేసుకున్నారు. వారిని వీలైనంత వరకూ బుజ్జగించడానికి లేకపోతే. వెళ్లిపోయినా ప్రభావం లేకుండా చేయడానికి కేసీఆర్ ప్లాన్ చేసుకుంటున్నారు. మొత్తంగా కేసీఆర్ అసంతృప్తి భయంతో అభ్యర్థుల ప్రకటనను ఆలస్యం చేసే అవకాశం లేదని.. వీలైనంత త్వరగా ప్రకటిస్తారని క్లారిటీ వచ్చింది.

మహేశ్వరం దాకా మెట్రో

(**మొదటిపేజీ తరువాయి**)

(ఉందన్న కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తామని.. అందులో ఎలాంటి డౌట్ లేదన్నారు. మహేశ్వరంలో మెడికల్ కాలేజీ మంజూరు చేస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా శంషాబాద్ నుంచి మహేశ్వరం వరకు మెట్రోను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం కేసీఆర్ వివరించారు. బీహెచ్ఈఎల్ నుంచి మహేశ్వరం, కందుకూరు వరకు మెట్రోపై చర్చలు జరుగుతున్నాయన్నారు. అలాగే తుమ్ములూరులో విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేస్తున్నామని... కమ్యూనిటీ హాల్ కు కోటి రూపాయలు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, రాచకొండ సీపీ చౌహాన్, ప్రభుత్వ ఉన్నత అధికారుల పాల్గొన్నారు. అంతకుముందు సఫారీ వాహనంలో పార్కులో కలియతిరిగిన సీఎం కేసీఆర్.. ఫొటో ఎగ్జిబిన్ ను, అటవీ అధికారుల సామగ్రిని తిలకించారు. అనంతరం బీటీఆర్ క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ మాట్లాడనున్నారు. తెలంగాణకు హరితహారం తొమ్మిదో విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 19.29 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. హరిత తెలంగాణ సాధనే లక్ష్యంగా 2015లో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. 230 కోట్ల మొక్కలు నాటే లక్ష్యంతో.. ఈ కార్యక్రమం చేపట్టారు. మే 2023 నాటికి 273.33 కోట్ల మొక్కలు నాటారు. తెలంగాణ గ్రీన్ కవర్ 7.7 శాతం పెరిగిందని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ధృవీకరించింది. సీఎం కేసీఆర్ సర్కారు ఎనిమిదేళ్లలో నాటిన 273.33 కోట్ల మొక్కలు చెట్లుగా మారి ఆక్సిజన్ తో పాటు ఆహ్లాదాన్ని పెంచుతున్నాయని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హరిత తెలంగాణ సాధనలో ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యమే పచ్చని విజయానికి సాక్షిగా నిలిచిందన్నారు. ప్రభుత్వం హరితహారం కార్యక్రమం కోసం రూ.10,822 ఖర్చు చేసిందన్నారు. మంత్రి కేటీఆర్ కూడా హరితోత్సవంపై స్పందించారు. ప్రపంచ చరిత్రలోనే ఇది మూడో అతిపెద్ద మానవ ప్రయత్నం అని ట్విట్టర్ వేదికగా చెప్పుకొచ్చారు.

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నాడు హరితోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా తుమ్మలూరు గ్రామంలో హరితహారం 9వ విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. మొక్కను నాటి హరిత హారాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా 2013 నుంచి 2023 వరకు273.33 కోట్ల మొక్కలు నాటారు. హరితహారం నిర్వహణ కోసం ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10,822 కోట్లు ఖర్చు చేసింది. 13,657 ఎకరాల విస్తీర్ణంలో 19,472 పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఇక 6,298 ఎకరాల విస్తీర్ణంలో 2,011 బృహత్ ప్రకృతి వనాలు, 1,00,691 కిలోమీటర్ల మేర రాష్ట్రం అంతటా రహదారి వనాలు ఏర్పాటు చేయడం జరిగింది.

3 నెలల ముందే 70 సీట్లు ప్రకటన

(**మొదటిపేజీ తరువాయి**)

భాగంగానే తెలంగాణలోనూ కర్నాటక ప్లాన్ అమలు చేయాలని టీ.కాంగ్రెస్ నేతలు కసరత్తు ప్రారంభించారు. 3 నెలల ముందే 60శాతం సీట్లు ప్రకటించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఢిల్లీ టూర్‌తో తెరపైకి కీలకాంశాలు వచ్చాయి. తెలంగాణపై ఫోకస్ పెంచాలని కోమటిరెడ్డి కాంగ్రెస్ పెద్దలను కోరినట్లు సమాచారం. ఇదిలా ఉంటే 3 నెలల్లో తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లాలు కవర్ అయ్యేలా ప్రియాంక టూర్ ప్లాన్ చేస్తున్న విషయం తెలిసిందే.టీ కాంగ్రెస్ నేతల్లో ఉత్సాహం నింపేలా అగ్రనేతలు పర్యటనలు చేపడుతున్నారు. పాదయాత్రలు, పర్యటనలకు సిద్ధమవుతున్నారు. బెంగళూరు కేంద్రంగా రేవంత్‌రెడ్డి రాజకీయ మంత్రాంగం రచిస్తున్నారు. ఇప్పటికే భట్టివిక్రమార్క పాదయాత్రతో నేతల్లో జోష్ నింపుతున్నారు. కర్నాటక విజయం తర్వాత బీఆర్ఎస్ కూడా ఫోకస్‌ను కాంగ్రెస్ వైపు మళ్లించినట్లు కనిపిస్తోంది. టీకాంగ్రెస్ తమ ప్రధాన ప్రత్యర్థిగా కేసీఆర్ భావిస్తున్నట్లు పరిస్థితులు చూస్తుంటే అర్థమవుతోంది. కర్నాటక వ్యూహాన్ని తెలంగాణ అమలు చేసేందుకు టీ కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు.

కర్నాటక లాగానే మూడు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించేందుకు ప్రయత్నిస్తున్నారు. కనీసం 60శాతం సీట్లు ముందే ప్రకటించేలా వ్యూహరచన చేస్తున్నారు. మరి కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలిస్తాయా.? కర్నాటకలో వర్కవుట్ అయిన ప్రయోగం తెలంగాణలో సక్సెస్ అవుతుందో తెలియాలంటే కాలమే సమాధానం చెప్పాలి.

అవినాష్ బెయిల్ పై

సుప్రీం కోర్టులో వాదనలు

(**మొదటిపేజీ తరువాయి**)

కేసులో నిందితుడిగా ఉన్న కడప ఎంపీ అవినాష్‌రెడ్డికి బెయిల్ ఇవ్వడం సరికాదని వాదించారు. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. అవినాష్, సీబీఐకి నోటీసులు ఇచ్చింది. సునీత పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అనంతరం విచారణను జులై 3కి వాయిదా వేశారు. వివేక హత్య కేసులో అవినాష్ రెడ్డికి మే 31న తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అవినాష్ ముందస్తు బెయిల్ ఇవ్వడానికి వ్యతిరేకంగా పిటిషన్ వేసిన సునీత జూన్ 13న తానే స్వయంగా వాదనలు వినిపించారు. ఆమెకు సహకరించేందుకు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రాను సుప్రీంకోర్టు బెంచ్ అనుమతించింది. సునీత పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం అత్యవసరం విచారణ చేపట్టాల్సిన అవసరమేముందని ప్రశ్నించింది. అవినాశ్ కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరమా లేదా విచారణకు సహకరిస్తున్నాడా లేదా అన్నది దర్యాప్తు సంస్థ వ్యవహారమని అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు సెలవుల అనంతరం పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తామని పేర్కొంది. దీనిపై కౌంటర్ వాదనలు వినిపించిన సునీత.. వివేక హత్యకేసు దర్యాప్తు ఈ నెల 30లోగా ముగించాలని సుప్రీంకోర్టే స్వయంగా చెప్పిందని గుర్తు చేశారు. ఈలోగా ఈ పిటిషన్‌పై విచారణ జరపాల్సిన అవసరం ఉందని వాదించారు. దీనికి సమాధానంగా ఇంకో ధర్మాసనం పెట్టిన డెడ్‌లైన్‌ను తాము మార్చలేమని బెంచ్ పేర్కొంది. దర్యాప్తు సంస్థకు తన వాదన వినిపించేలా అవకాశం ఇవ్వాలని సునీత అభ్యర్థించారు. అది ఆ సంస్థ ఇష్టమని అందుకే జులై 3కు విచారణ వాయిదా వేస్తున్నట్టు బెంచ్ పేర్కొంది. హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను కూడా సుప్రీంకోర్టు తప్పుపట్టిందని బెంచ్‌కు సునీత తెలియజేశారు. దీనిపై స్పందించిన బెంచ్ నోటీసులు ఇచ్చేందుకు తాము సిద్ధంగా లేమని పిటిషనర్ కోరినందున తర్వాత విచారణ జూన్ 19న చేపడతామని చెప్పింది బెంచ్. ఇవాళ విచారణ చేపట్టిన బెంచ్ అవినాష్, సీబీఐకి నోటీసులు జారీ చేసింది. అంతరం విచారణ వాయిదా వేసింది.

ఖమ్మంలో డ్రగ్స్

కేసు మూలాలు

(**మొదటిపేజీ తరువాయి**)

ప్రాంతానికి వచ్చి మంతనాలు జరిపాడని తెలుస్తున్నది.అధికారులతో కొన్ని భూ వివాదాల్లో తల దూర్చి కోట్లల్లో సంపాదించాడని సమాచారం. గృహ సముదాయంలో ఎవరి ఇంటికి వచ్చాడు.. ఎందుకు వచ్చాడు.. ఎలాంటి వ్యాపారం నిర్వహించాడు వంటి అంశాలపై గోప్యంగా విచారణ జరుగుతున్నది. ఇతను ఎవరి కోసం ఖమ్మం రాకపోకలు సాగించాడు అనే కోణంలో కూపీ లాగుతున్నట్లు సమాచారం. మరోవైపు ఇతడితో అంటకాగిన అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నట్లు తెలుస్తున్నది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన డ్రగ్ పెడ్లర్ కేపీచౌదరి వ్యవహారం ఇదే సముదాయానికి చుట్టుకొని ఉండటం సరికొత్త వివాదానికి తెరతీసిందని సమాచారం. కేపీ చౌదరి ఖమ్మం వాసి కావడం అనేక మంది ఇదే సామాజిక వర్గం నుంచి సినీ ఇండస్ట్రీలో ఉండటం వారితో పరిచయాలు ఉండటంతో పాటు ఖమ్మం, హైదరాబాద్ రాకపోకలు సాగిస్తుండటంతో ఈ వివాదానికి ఆజ్యం పోసినట్లు అయిందని భావిస్తున్నారు.కేపీ చౌదరి ఖమ్మంలో అనేక మంది ప్రముఖులు నివాసం ఉండే ప్రాంతానికి వచ్చి కొంత మంది ప్రముఖులతో మంతనాలు జరిపాడని సమాచారం. ప్రముఖ అధికారులతో కొన్ని భూ వివాదాల్లో తల దూర్చాడని సమాచారం. ఇతనికి ఉన్న పరిచయాలతో హైదరాబాద్, ఖమ్మంలో పలు భూ దందాల్లో జోక్యం చేసుకొని కోట్లల్లో అక్రమార్జనకు పాల్పడినట్లు సమాచారం. కేపి చౌదరికి వచ్చి పోయే ఆ భారీ గృహ సముదాయంలో ఎవరి ఇంటికి వచ్చాడో ..? ఎందుకు వచ్చాడో ..? ఎలాంటి వ్యాపారం నిర్వహించాడో తెలియాల్సి ఉంది. అకస్మాత్తుగా డ్రగ్స్ దందాలోకి వచ్చి ఉండడని సిని ప్రొడ్యుసర్‌గా ఎదగడం వెనుక ఇతను చేసిన అక్రమాలు ఏమున్నాయో..? ఎలాంటి వ్యక్తులు ఇతనికి సహకరించారో ..? ఇతను ఎవరి కోసం ఖమ్మం రాకపోకలు సాగించాడో అనే కోణంలో హైదరాబాద్ స్థాయి అధికారులు కూపి లాగుతున్నట్లు సమాచారం. ఆయనతో అంటకాగి, అతను చెప్పింది చేసిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నట్లు తెలుస్తుంది. తాము తీసుకున్న గోతిలో పడతామని భావించి ఆందోళన చెందుతున్నారట. కాపాడమని ఎవరిని అడగాలి .. ఈ వ్యవహారంలో ఎవరు కాపాడుతారో తెలియక టెన్షన్ పడుతున్నారు. తాజా పరిణామాలతో కేపి చౌదరి సన్నిహితులు, అనేక మంది ప్రముఖులు తలలు పట్టుకుంటున్నారు.

పొలిటికల్ స్క్రీన్‌పై కొత్త చిత్రాలు

(**మొదటిపేజీ తరువాయి**)

సంధించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 20 సీట్లలో పోటీ చేసిన ఓఎఓ.. 7చోట్ల గెలిచింది. ఇక 2018లో 8 అసెంబ్లీ సెగ్మెంట్స్‌లో పోటీ చేసి 7 స్థానాలు కైవసం చేసుకుంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని మిగతా రాజకీయపక్షాల కంటే ముందుగానే ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టినట్టు కనిపిస్తోంది ఎంఐఎం నాయకత్వం. అందరూ ఎన్నికల మూడ్‌లోనే ఉన్నా? ప్రచార సభల స్థాయిలో ఇంకా గేరప్ అవలేదు. కానీ? మజ్లిస్ పార్టీ నాయకత్వం మాత్రం రాష్ట్రాన్ని చుట్టేస్తోంది. దీన్నిబట్టి చూస్తే? ఎంఐఎం విస్తరణకు సిద్ధమైందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. హైదరాబాద్ పాతబస్తీలో గట్టి పట్టున్న మజ్లిస్ పార్టీ? ఆ ప్రాంతానికి వెలుపల పోటీ చేసినా? అది చాలా పరిమితంగా ఉండేది. కానీ? తాజాగా ఆ పార్టీ నాయకత్వపు తీరు చూస్తుంటే? తెలంగాణలో విస్తరించాలన్న పట్టుదల కనిపిస్తోందని అంటున్నారు విశ్లేషకులు. పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ? అధికార పార్టీని టార్గెట్ చేస్తున్న తీరు చూస్తే?. ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ సీట్లలో ఒంటరిగా పోటీ చేసే ఆలోచన ఉన్నట్టు చెబుతున్నారు.తెలంగాణలో ఈసారి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ ఖాయంగా కనిపిస్తోంది. ఎంఐఎం కూడా సింగిల్‌గా ఓల్డ్ సిటీ బయటికి వస్తే? కొన్ని సీట్లలో అయినా చతుర్ముఖ పోటీ తప్పక పోవచ్చు. ఒకవేళ అదే జరిగితే ఎవరి ఓట్లు చీలి ఎవరికి లాభం కలుగుతుందన్న విశ్లేషణలు జరుగుతున్నాయి. మజ్లిస్ పార్టీ పాతబస్తీ బయట పై అంటే? ముస్లిం మైనార్టీల ఓట్లు చీలడం ఖాయమంటున్నారు. అప్పుడు ఎవరికి పడాల్సిన ఓట్లు ఎటుపోతాయన్నది క్వశ్చన్. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం వెనక ముస్లింల ఓటు బ్యాంక్ ఉందన్నది ఫలితాలు చెప్పిన సత్యం. అంటే.. అక్కడ మైనార్టీ ఓట్లలో మెజార్టీ వాటా కాంగ్రెస్‌కే వెళ్ళిందన్న మాట. తెలంగాణలో కూడా చాలా నియోజకవర్గాల్లో ముస్లిం ఓట్లు చెప్పుకోతగ్గ స్థాయిలో ఉన్నాయి. మొత్తంగా కాకున్నా? అవి కొంతవరకు కాంగ్రెస్‌కు మళ్ళే అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు మజ్లిస్ ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేస్తే? ఓట్లు చీలి కాంగ్రెస్‌కు నష్టం జరుగుతుందా? అన్న అంచనాలు సైతం ఉన్నాయి. అదే సమయంలో బీఆర్ఎస్‌కు సైతం ఓట్ల చీలిక భయం ఉందట. కానీ? ఎక్కువ నష్టం కాంగ్రెస్‌కే జరగవచ్చంటున్నారు విశ్లేషకులు.

సంపాదకీయం

మణిపూర్ లో ప్రశాంతత ఎప్పుడు

45 రోజులుగా భగ్గున మండుతున్న మణిపూర్‌లో ప్రశాంతత నెలకొల్పేందుకు ఎట్టకేలకు ఒక రాజకీయ ప్రయత్నం మొదలైంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆ రాష్ట్రంలో పర్యటించి పరస్పరం కలహిస్తున్న మెయితీ, కుకీ తెగల నాయకులతో, పౌర సమాజ కార్యకర్తలతో, రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు. సమస్య ఉగ్రరూపం దాల్చినప్పుడు, జనం చావుబతుకులమధ్య కొట్టుమిట్టాడుతున్నప్పుడు పాలకులుగా ఉన్నవారు సంయమనంతో మెలగటం, సాధారణ స్థితి ఏర్పడేందుకు ప్రయత్నించటం అవసరం. మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్‌కు ఈ ప్రాథ మిక విషయాలు కూడా తెలిసినట్టు లేదు. ఇప్పటివరకూ జరిగిన ఘర్షణల్లో దాదాపు 80 మంది ప్రాణాలు కోల్పోయారు. 40,000 మంది వరకూ కొంపా గోడూ వదిలి చెట్టుకొకరు, పుట్టకొకరు అయ్యారు. ఊళ్లకు ఊళ్లే మంటల్లో మాడి మసయ్యాయి. పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి తుపాకులు, మందుగుండు అపహరించిన ఉదంతాలు జరిగాయి. ఇలాంటి సమయంలో ‘ఇదంతా కుకీ ఉగ్ర వాదులకూ, భద్రతా దళాలకూ సాగుతున్న ఘర్షణ తప్ప మరేంకాద’ని బీరేన్ సింగ్ ప్రకటించటం ఆశ్చర్యం కలిగిస్తుంది. పరోక్షంగా కుకీలను మిలిటెంట్లుగా, ఉగ్రవాదులుగా చిత్రీకరించటమే ఆయన ప్రకటన వెనకున్న సారాంశమన్న విమర్శలు వెల్లువెత్తాయి. రక్షణ దళాల చీఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సీఎం ప్రకటనను తోసిపుచ్చారు. ఇది కేవలం రెండు తెగల మధ్య ఘర్షణేనని తేల్చి చెప్పారు. మెయితీ తెగకు చెందిన నేతగా బీరేన్ సింగ్‌కు వ్యక్తిగతంగా ఎలాంటి అభిప్రాయాలైనా ఉండొచ్చు. కానీ పాలకుడిగా స్పందించాల్సి వచ్చినప్పుడూ, రాష్ట్రం ఇంకా ఘర్షణలతో అట్టుడుకు తున్నప్పుడూ ఆచి తూచి మాట్లాడాలి. తమ తెగవారిపై జరుగుతున్న దాడుల మాటేమిటని కుకీ శాసనసభ్యులు నిలదీస్తే ఆయన నుంచి సమాధానం లేదు. ఇదొక్కటే కాదు... హింసను సాకుగా చూపి 25 మిలిటెంట్ సంస్థలతో కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం నుంచి తప్పుకుంటున్నట్టు బీరేన్ సింగ్ ఏకపక్షంగా ప్రకటించటం కూడా సమస్య తీవ్రతను పెంచింది. కుకీలతో అమిత్ షా నిర్వహించిన సమావేశానికి సీఎం రాలేని స్థితి ఏర్పడటం, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని వారు కోరటం రాష్ట్ర ప్రభుత్వంపై ఏర్పడిన అవిశ్వాసానికి అద్దం పడుతుంది. మణిపూర్‌తో పాటు ఇతర ఈశాన్య రాష్ట్రాలు ఎంతో వైవిధ్యభరితమైనవి. అక్కడి నాలుగున్నర కోట్ల జనాభాలో 400కు పైగా తెగలున్నాయి. మాండలికాలు సైతం దాదాపు అంతే సంఖ్యలో ఉంటాయి. వీరంతా భిన్న సంస్కృతులు, విశ్వాసాలకు చెందినవారైనా... అప్పుడప్పుడు అపోహలు తలెత్తిన సందర్భాలున్నా మొత్తంమీద శతాబ్దాలుగా కలిసిమెలిసి ఉంటున్నారు. అయితే ఇంచుమించు ఏభైయ్యేళ్లుగా ఇదంతా మారింది. తెగల పరిరక్షకులమంటూ సాయుధ బృందాలు తలెత్తటం మొదలైంది. ఉపాధి లేమివల్ల కావొచ్చు... జీవికకు ముప్పు కలుగుతుందన్న భయాందోళనల వల్ల కావొచ్చు చిన్న సమస్య రాజుకున్నా అది క్షణాల్లో కార్చిచ్చుగా మారి కల్లోలం రేపుతోంది. తమకు స్వయం పాలిత ప్రాంతాన్ని ఏర్పరచాలన్న డిమాండ్ బయల్దేరుతోంది. వివిధ రాష్ట్రాల్లో తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలను కలిపి ‘ప్రత్యేక నాగాలిమ్’ ఏర్పరచాలని నాగాలు పదేళ్ల క్రితం తీవ్ర ఆందోళనకు దిగారు. పరిమిత వనరులను పలువురితో పంచుకోవటం తప్పనిసరి కావటంతో అవత లివారు శత్రువులుగా కనిపిస్తున్నారు. మెయితీలను సైతం ఎస్టీలుగా పరిగణించాలన్న న్యాయస్థానం ఆదేశాలు ఈ కారణంతోనే ఆదివాసీలైన కుకీల్లో కల్లోలం సృష్టించాయి. ఇదే అదునుగా ఘర్షణలు తలెత్తాయి. పొరుగునున్న మయన్మార్ నుంచి వచ్చిపడుతున్న శరణార్థులను అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని మెయితీ నాయకులు చెప్పటం సమస్యను తగ్గించి చూపటమే అవుతుంది. అసలు కుకీలు స్థానికులు కాదనీ, వారు మయన్మార్ నుంచి వలస వచ్చినవారనీ చాన్నాళ్లనుంచి మెయితీలు వాదిస్తున్నారు. రాష్ట్రంలో జాతీయ పౌరసత్వ చిట్టా (ఎన్ఆర్‌సీ) అమలు చేసి, పౌరసత్వాన్ని నిగ్గుతేల్చి స్థానికేతరులను పంపేయాలని వారు కోరుతున్నారు. 53 శాతంగా ఉన్న మెజారిటీ తెగ నుంచి ఇలాంటి డిమాండ్ రావటం కొండప్రాంతాల్లో ఉంటున్న కుకీల్లో సహజంగానే గుబులు రేపుతోంది. 1901 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాలో కుకీలు 14.5 శాతం. 110 ఏళ్ల తర్వాత 2011 నాటికి వారి జనాభా పెరుగుదల రెండు శాతం మాత్రమే. అలాంటపుడు కుకీలపై స్థానికేతరుల ముద్రేయటం అసంబద్ధం కాదా? ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రకటనలనూ, తెగల మధ్య అపోహలు పెంచే వదంతులనూ నివారించటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దాని పర్యవసానంగానే ఇంత హింస చోటుచేసుకుంది. నిరుడు యూపీలోని మథురలో కన్నవారి కర్కశత్వానికి బలైపోయిన 21 ఏళ్ల యువతిని మెయితీ తెగ మహిళగా చిత్రించి, ఆమెపై కుకీలు అత్యాచారానికి పాల్పడి హతమార్చారని తప్పుడు ప్రచారం జరపడంతో ఉద్రిక్తతలు రాజుకున్నాయి. కుకీ తెగ మహిళలపై దాడులు జరిగాయిఅత్యాచార ఉదంతాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఇక చుర్‌చాంద్‌పూర్‌లో హిందూ దేవా లయాలపై దాడులు సాగించారన్న వదంతులు లేవదీశారు. ఇదంతా అబద్ధమని వెంటనే ఆ ప్రాంత మార్వాడీ, పంజాబీ సొసైటీలు, బెంగాలీ సొసైటీ, బిహారీ సొసైటీ సంయుక్తంగా ప్రకటించాయి. తెగల పేరుతో, మతం పేరుతో ప్రజల్లో చీలికలు తెచ్చే యత్నాలను మణిపూర్ పౌర సమాజం ఐక్యతతో తిప్పికొట్టాలి. పాలకులు, రాజకీయ పార్టీల నేతలు జవాబుదారీతనంతో మెలగాలి. అప్పుడే ప్రశాంత మణిపూర్ సాధ్యమవుతుంది.

ఎంపీ ల్యాడ్స్ తోనే ఇంటి నిర్మాణం

అదిలాబాద్ - ప్రభాత సూర్యుడు : ఆదిలాబాద్ ఎంపీ సోయంబాపురావు ఎంపీ ల్యాడ్ నిధుల పంపిణీ వివాదస్పదంగా మారింది. తాను ల్యాడ్స్ నిధులను ఇంటి నిర్మాణం కోసం వాడుకున్నట్లుగా కుండబద్దలు కొట్టినట్లుగా ఎంపీ చెప్పారు. తన కుమారుడి పెళ్లి, ఇంటినిర్మాణం కోసం నిధులు వాడుకున్నానని సంచలన వ్యాఖ్యలు చేశారు. కానీ గతంలో ఉన్న ఎంపీలు మొత్తం నిధులు అమ్ముకున్నారని విమర్శించారు. ఈ సంవత్సరం ల్యాడ్ నిధులు రావడంతో బీజేపీ ప్రజాప్రతినిధులకు కేటాయించడానికి ఆదిలాబాద్ లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రజాప్రతినిధులకు నిధులు కేటాయించారు. ఈ సందర్భంగా కొందరు బీజేపీ నాయకులు తనపై అనవసరమైన విమర్శలు చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇంటి నిర్మాణం కోసం ల్యాడ్ నిదులు వాడుకోవడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. నిధుల దుర్వినియోగం చేసిన ఎంపీపై చర్యలు చేపట్టాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి.

ధరణి చుట్టూ రాజకీయ పార్టీలు

(మొదటిపేజీ తరువాయి)

కాబోతుందన్న చర్చ జోరుగా జరుగుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పదే పదే చెబుతున్నారు. పేదల చేతుల్లో ఉన్న లక్షల ఎకరాల భూమిని ధరణి పేరుతో మళ్లించారని ఆరోపించారు. ప్రతి గ్రామంలో రైతన్నలు ఇబ్బంది పడుతున్నారని చెబుతున్నారు. ఇదే అంశాలను ఆ పార్టీకి చెందిన నేతలందరూ ప్రస్తావిస్తున్నారు. స్థానికంగా జరుగుతున్న సమావేశాల్లోనూ ధరణి సమస్యలను తెరపైకి తీసుకువస్తూ... ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. ధరణి పోర్టల్ ద్వారా జరిగిన 25 లక్షల లావాదేవీలపై విచారణ జరగాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. ధరణి పోర్టల్ సింపుల్ సాఫ్ట్ వేర్ కాదన్నారు. దోపిడీ చేసేందుకే ధరణి తీసుకొచ్చారని అంటున్నారు. పార్టీలోని కీలక నేతలే కాదు... స్థానిక నేతలు కూడా ధరణి అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఎన్నికల వేళ... ధరణిని ఓ అస్త్రంగా ప్రయోగించే దిశగా అడుగులు వేస్తోంది కాంగ్రెస్ఇక ధరణిపై కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని బీఆర్ఎస్ తిప్పికొట్టే పనిలో పడింది. స్వయంగా ఆ పార్టీ అధినేత కేసీఆరే.... కాంగ్రెస్ ను తెగ టార్గెట్ చేస్తున్నారు. ధరణిని రద్దు చేస్తామనే వాళ్లనే బంగాళాఖాతంలో వేయాలని పిలుపునిస్తున్నారు. ధరణిని రద్దు చేస్తే... రైతుబంధు, బీమా వంటి పథకాలు అగిపోతాయంటూ గులాబీ పార్టీ నేతలు తెరపైకి తీసుకువస్తున్నారు. పారదర్శకంగా ఉన్న ధరణి రద్దు చేస్తే అనేక సమస్యలు వస్తాయని చెబుతున్నారు. రద్దు చేస్తామని చెబుతున్న పార్టీకి అధికారం ఇవ్వొద్దని కోరుతున్నారు. ఇక బీజేపీ వాదన మరోలా ఉంది. ఇదే అంశంపై స్పందించిన బండి సంజయ్?. ధరణిని రద్దు చేయమని అన్నారు. కానీ అందులో ఉన్న సమస్యలను పరిష్కారిస్తామంటూ కామెంట్స్ చేశారు. మరో వైపు రణిపై తెలంగాణ రాజకీయాల్లో గట్టిగా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే ధరణిని రద్దు చేస్తామని పదే పదే చెబుతోంది. ఇక అలా చేసే పార్టీలను బంగాళాఖాతంలో వేయా లంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజలను కోరుతున్నారు. ఫలితంగా ఇరు పార్టీల మధ్య గట్టి వార్ నడుస్తోంది. ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్.... కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వాదనకు భిన్నంగా.....కామెంట్స్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే.... ధరణిని రద్దు చేయమని స్పష్టం చేశారు. కానీ అందులో ఉన్న సమస్యలను పూర్తిగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రద్దు మాత్రం చేయమని చెప్పారు. ఇక ప్రస్తుతం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కూడా.... కొనసాగిస్తామని వ్యాఖ్యానించారు. బండి సంజయ్ చేసిన ఈ వ్యాఖ్యలు కాస్త.... తెలంగాణ పాలిటిక్స్ లో ఆసక్తికరంగా మారాయి హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ సంయుక్త మోర్చాల సమావేశం జరిగింది. ఇందుకు కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ తో కలిసి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన....బీజేపీ గ్రాఫ్ ను దెబ్బతీసి కాంగ్రెస్ ఇమేజ్ ను పెంచేందుకే కేసీఆర్ కుట్ర చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని పైకి లేపడానికి మోదీ మాకు మిత్రుడేనని సీఎం అంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌కు మోడీ ఎలా దోస్త్ అయ్యారో చెప్పాలని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్, ప్రధాని మోదీకి నక్కకు.. నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని విమర్శలు చేశారు. కేసీఆర్ ప్రపంచంలోనే అత్యంత అవినీతి పరుడని ఫైర్ అయ్యారు. మోదీ మంత్రివర్గంలోని ఏ ఒక్క మంత్రిపై అవినీతి మరక లేదని.. కేసీఆర్ కేబినెట్‌లో అవినీతి మరకలేని మంత్రి లేరని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాక.. సంక్షేమ పథకాలన్నీ మరింత మెరుగ్గా అమలు చేస్తామన్నారు జమొత్తంగా ఎన్నికలు సమీపిస్తున్న వేళ?. ధరణి అంశం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. రద్దు చేస్తామంటూ పదే పదే కాంగ్రెస్ చెబుతుండటం? బీఆర్ఎస్ కౌంటర్లు ఇస్తున్న నేపథ్యం లో?. వచ్చే ఎన్నికల్లో ధరణి అంశం గట్టి ప్రభావం చూపే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. అయితే ఇది ఎవరికి అస్త్రంగా మారబోతుందనేది చూడాలి?

కాక రేపుతున్న పాదయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

పాదయాత్రతో..టీ కాంగ్రెస్‌లో మరింత జోష్ పెరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భట్టి పాదయాత్ర ఎంటీ తర్వాత రాజకీయంగా ప్రకంపనలు రేగుతున్నాయి. నల్గొండ అభివృద్ధి, బీఆర్ఎస్ ఎన్నికల హామీలపై భట్టి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎన్నో ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా జిల్లాకు చేసిందేమీలేదని విమర్శించారు భట్టి. భట్టీ కామెంట్స్ బీఆర్ఎస్‌లో కాకరేపాయి. భట్టి విక్రమార్క విమర్శలపై గుత్తా సుఖేందర్‌రెడ్డి ఫైరయ్యారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర గమనం, గమ్యం లేకుండా పోయిందని విమర్శించారు. పాదయాత్రకు ప్రజల నుండి స్పందన కరువైందన్నారు గుత్తా సుఖేందర్‌రెడ్డి. గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యలపై కౌంటర్ ఎటాక్ చేశారు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క. గుత్తా సుఖేందర్‌రెడ్డే గమ్యం, గమనంలేని పొద్దుతిరుగుడు పువ్వు అని విమర్శించారు. అధికారం ఎక్కడ ఉంటే అటువైపు వెళ్లే వ్యక్తి అని మండిపడ్డారు భట్టి విక్రమార్క. భట్టి విక్రమార్క పాదయాత్రతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడిందని కొనియాడారు రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే. నల్లగొండజిల్లాలో కొనసాగుతున్న భట్టిపాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ-బీఆర్ఎస్ రహస్యమిత్రులేనని విమర్శించారు మాణిక్‌రావ్ ఠాక్రే. మొత్తంగా..కర్ణాటక గెలుపు తర్వాత జోష్ మీదున్న కాంగ్రెస్ నేతలు..బీఆర్ఎస్‌ను గట్టిగా టార్గెట్ చేస్తున్నారు. ఐతే..తెలంగాణ అవతరణ దినోత్సవాల జోష్‌లో ఉన్న ఃఖీా నేతలు కూడా కాంగ్రెస్ విమర్శలకు కౌంటర్లు ఇస్తున్నారు.

జూలై 12న చంద్రయాన్

(మొదటిపేజీ తరువాయి)

నుండి జులై-12న చంద్రయాన్-3 మిషన్ ప్రయోగిస్తారు. జియోసింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ జీఎస్ఎల్వీ ఎంకే నుండి చంద్రయాన్-3 మిషన్ ను అంతరిక్షంలోకి ప్రయోగిస్తారు. భూమిపై కాకుండా మరో ప్రదేశంలో తన వాహనాన్ని సాఫ్ట్ ల్యాండింగ్ చేసే సామర్థ్యాన్ని పొందడమే ఈ మిషన్ ఉద్దేశం. భారతదేశపు అత్యంత బరువైన రాకెట్ చంద్రయాన్-3. ఇస్రో చేత తయారు చేయబడిన మూడు దశల ప్రయోగ వాహనం ఇది. చంద్రయాన్-3లో స్వదేశీ ల్యాండర్ మాడ్యూల్ , ప్రొపల్షన్ మాడ్యూల్‌తో పాటు రోవర్ ఉంటాయి. ఇది గ్రహాంతర మిషన్ లకు అవసరమైన కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేస్తుంది. ల్యాండర్ మాడ్యూల్ కు నిర్ణీత ప్రదేశంలో రోవర్ ను సాఫ్ట్ ల్యాండింగ్ చేసే సామర్థ్యం ఉంటుంది. చంద్రుని మీద ప్రయోగానికి సన్నద్ధం చేసే హాట్ టెస్ట్, కోల్డ్ టెస్టులు ఇప్పటికే పూర్తి అయ్యాయని ఇస్రో ప్రకటించింది. ప్రయోగ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు చంద్రయాన్- 3లో హార్డ్‌వేర్, స్ట్రక్చర్, కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్, సెన్సార్లలో మార్పులు చేశారు. ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి కోసం పెద్ద సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. అదనపు సెన్సార్ కూడా జోడించారు. దీని వేగాన్ని కొలవడానికి లేజర్ డాప్లర్ వెలాసిటీమీటర్ ను కూడా అమర్చారు. చంద్రయాన్ 3 ద్వారా చంద్రుని ఉపరితలంపై ప్లాస్మా, పర్యావరణం, థర్మో ఫిజికల్ లక్షణాలు, భూకంప అవకాశాలను అధ్యయనం చేసేందుకు అవసరమైన సైంటిఫిక్ పరికరాల్ని పంపిస్తున్నారు. చంద్రయాన్ -1 ను 2008 అక్టోబర్ 22 న పిఎస్ఎల్వి-చీఒ రాకెట్ ద్వారా ప్రయోగించారు.

ఈ యాత్రలో ఇంపాక్టర్ ప్రయోగించారు. చంద్రుడిపై నీరు ఉందని ఈ ఇంపాక్టర్ కనుక్కుంది. అప్పటికి భారత్ తరపున ఇదే పెద్ద విజయం. దీనితో పాటు, చంద్రుని మ్యాపింగ్, వాతావరణ ప్రొఫైలింగ్ వంటి ఇతర పనులను కూడా చంద్రయాన్ -1 చేసింది. 2019 జులైలో చంద్రయాన్-2 ప్రయోగిం చారు. 2019 జూలై 15 న ఈ ప్రయోగం చేయాలని అనుకున్నా, సాంకేతిక కారణాల వలన ప్రయోగానికి 56 నిముషాల ముందు రద్దు చేసారు. క్రయోజనిక్ దశలో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సరిచేసిన తరువాత, 2019 జూలై 22 న మధ్యాహ్నం 2:43 గంటలకు చంద్రయాన్-2 ను జిఎస్ఎల్‌వి ఓఐ3 ఓ1 వాహనం ద్వారా ప్రయోగించి భూకక్ష్యలో ప్రవేశపెట్టారు. భూ కక్ష్యనుంచి విజయవంతంగా చంద్రుని కక్ష్యలోకి ఈ మిషన్ ని ప్రవేశ పెట్టారు. చంద్రుని కక్ష్యలో చేరాక, ప్లాన్ ప్రకారమే ఆర్బిటరు, ల్యాండరు విడిపోయాయి. ఆ తరువాత ల్యాండరు ఆ కక్ష్య నుండి రెండు అంచెలలో దిగువ కక్ష్య లోకి దిగి, అక్కడి నుండి చంద్రుడి ఉపరితలం పైకి ప్రయాణం సాగించింది. ల్యాండర్ చంద్రుడి ఉపరితలానికి 2.1 కి.మీ. ఎత్తులో ఉండగా, దానికి భూమితో సంబంధాలు తెగిపోయాయి. చంద్రయాన్ 2లో భాగమైన విక్రమ్ ల్యాండర్.. చంద్రుడిపై అడుగు పెట్టడంలో విఫలమైంది. ఆ తరువాత అది క్రాష్ ల్యాండ్ అయింది. ఉత్తర ధృవం వైపు నేలకూలిందని ఇస్రో ప్రకటించింది. చంద్రయాన్-3 పై ఇస్రో భారీ అంచనాలు పెట్టుకుంది. చంద్రయాన్-2 వైఫల్యాలను అదిగమించి దీన్ని సక్సెస్ చేయాలని నిర్ణయించారు ఇస్రో అధికారులు. దానికి తగ్గట్టే ఏర్పాట్లు చేస్తున్నారు. జులై-12న చంద్రయాన్-3 ప్రయోగం మొదలవుతుంది. అయితే చంద్రయాన్ మిషన్ చంద్రుడిపై సేఫ్ ల్యాండ్ అయినప్పుడే ఇది సక్సెస్ అయినట్టు లెక్క. చంద్రయాన్ కి సంబంధించి తాజా ఫోటోలను ఇస్రో విడుదల చేయడంతో ఈ ప్రాజెక్ట్ పై మరింత్ ఆసక్తి పెరిగింది.

ప్రజా సమస్యలును సత్వర పరిష్కారానికి కృషి

పోలీస్ గ్రీవెన్స్ లో పలు ఫిర్యాదులను జిల్లా ఎస్పీ భాస్కర్ పరిశీలన

జగిత్యాల - ప్రభాత సూర్యుడు : ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 26 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ రోజు వచ్చిన ఫిర్యాదులు భూ సమస్యలు, భార్య భర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్, గల్ఫ్ కు పంపిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన సమస్యల పైన ఫిర్యాదులు రావడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.

ప్రతీ ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, బాధితుల ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని రిలే దీక్ష

బీ ఆర్ ఎస్ నాయకుల మద్దతు

చొప్పదండి -ప్రభాత సూర్యుడు : మహనీయుల ఆశయాలతో మహనీయుల బాటలో శాంతియుతంగా ముందుకు సాగుతున్న కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గర్శకుర్తి గ్రామ మండల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్ష 51వ రోజుకి చేరుకుంది. ఈ కార్యక్రమంలో అలువాల తిరుపతి, తడిగోప్పుల రమేష్, మాజీ సర్పంచ్ కముటం రాజమల్లయ్య, అలువల శ్రీనివాస్, గుంటుకు మల్లయ్య ,గర్శకుర్తి గ్రామ ఉపసర్పంచ్ దాది జలపతి నల్ల శ్రీనివాస్ లింగంపెల్లి రవి మిట్టపెల్లి గణేష్, రేణికుంటా రాజేందర్ మామిడిపెల్లి అఖిల్, దాసరి శేఖర్ తడిగొప్పుల ఆంజనేయులు అలువల అమృతలాల్, గుజ్జుల శ్రీనివాస్ రిలే నిరాహారదీక్ష కు మద్దతు తెలిపారు అని గర్శకుర్తి మండల సాధన సమితి సభ్యులు పొత్తూరి సురేష్, మండల సాధన సమితి సభ్యులు అలువాల భూమయ్య అలువల రాజేశం, గడ్డం నారాయణ పొత్తూరి రమేష్ దాసరి రాజయ్య శ్రీరామ్ శ్రవణ్ శ్రీనివాస్, మల్లికార్జున్ పోరెడ్డి లక్ష్మారెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ

విరివిగా మొక్కలు నాటాలి

మున్సిపల్ ఛైర్ పర్సన్ ఆన్నం లావణ్య

కోరుట్ల – ప్రభాత సూర్యుడు : ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య -అనిల్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలులో భాగంగా సోమవారం కోరుట్ల మునిసిపాలిటీ లో తెలంగాణ హరితోత్సవం కార్యక్రమం నిర్వహించారు..ఈ సందర్భంగా పట్టణంలోని వెంకట సాయి నగర్ కాలనీ లో మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య -అనిల్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మానవ మనుగడకు చెట్లు ఉపయోగపడతాయని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని కొరారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కమిషనర్ ఎండి అయాజ్, డిప్యూటీ ఈఈ అభినయ్,టీపీవో ఏ.ప్రవీణ్ కుమార్,ఏఈ లక్ష్మి, మేనేజర్ శ్రీనివాస్,ఆర్వోబీ తిరుపతి, మున్సిపల్ కౌన్సిలర్లు , మెప్మా సిబ్బంది ఆర్పీలు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషిచేద్దాం

నియోజకవర్గ ఇంచార్జ్ బెక్కం జనార్ధన్

జగిత్యాల – ప్రభాత సూర్యుడు : జగిత్యాల జిల్లాలో జనసేన పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరం కృషి చేద్దామని జనసేన జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ బెక్కం జనార్ధన్ పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక హోటల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ త్వరలోనే జనసేన-పవనన్న ప్రజాబాట కార్యక్రమం చేపట్టి ప్రతి గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ కార్యకర్తలతో మమేకమై పార్టీలోకి చేరికలను ప్రోత్సహిస్తూ పల్లెపల్లెనా జనసేన జెండా నిర్మాణ కార్యక్రమాలతో ముందుకు పోదామని పిలుపునిచ్చారు. జనసేన బలోపేతానికి ప్రతి ఒక్కరూ నిరంతర కృషి చేయాలని జనార్ధన్ కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన జగిత్యాల మండల అధ్యక్షులు బొల్లి రాము, ఉపాధ్యక్షులు లక్ష్మన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శనిగరపు రాకేష్, సెక్రటరీ గొడుగు శ్రీనివాస్, కిరణ్ సింగ్ తాటి పెల్లి అజయ్, గౌతమ్, కొంగరి శివ కుమార్, గంగాధర్, వడ్లూరి హరీశ్, రాయికల్ మండలం కాసవేని మల్లికార్జున బాబు, బొద్దుల శివ కుమార్ బాబు, వీర, మహిళ విభాగం మోగులోజి విజయ, స్వప్న, పద్మ, శ్రావణి, గీత, కోరుట్ల నాయకులు ఆజయ్ కుమార్ ఉన్నారు.

బీజేపీ నేతల అరెస్టు

బాసర – ప్రభాత సూర్యుడు : నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐఐటీ లో ముగ్గురు విద్యార్థినులు మొన్న ఆత్మ హత్య చేసున్నారు. ఆ సందర్భంగా ఈ రోజు ఆ కాలేజ్ దగ్గరకు వెళ్ళి కారణాలు తెలుసుకోవాలని, సహ విద్యార్థినులకు భరోసా ఇద్దామని వెళ్లిన బీజేపి మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి ని, ఇతర బీజేపి నాయకులను బలవంతంగా పోలీసులు అరెస్ట్ చేసి బాసర పోలీస్ స్టేషన్ కు తీసుకు వెళ్ళారు ఇప్పుడే. పోలీస్ స్టేషన్ లో బీజేపి నేతలకు, పోలీసులకు వాగ్వాదం నడుస్తోంది. కేవలం పరామర్శించడానికి, కారణం తెలుసుకోవడానికి వెళితే అరెస్ట్ చేస్తారా అని గీతా మూర్తి పోలీసుల మీద మండి పడ్డారు.

మానవ మనుగడకు చెట్లు ఉపయోగపడతాయి

రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల – ప్రభాత సూర్యుడు : చెట్లుమానవ మనుగడకు ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ హరితోత్సవం కార్యక్రమంలో భాగంగా సారంగాపూర్ బతుకమ్మ కుంట అటవీ క్షేత్రం, ధర్మపురి మండలం నేరెళ్ళ లో జరిగిన కార్యక్రమాలలో మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచం అబ్బురపరిచే విధంగా తెలంగాణ రాష్ట్రంలో హరిత హారం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా, భావితరాల వారికి పర్యావరణ సంపదను అందించేందుకు ప్రవేశపెట్టి, ఇప్పటి వరకు 8 విడతల్లో రాష్ట్రంలో 230 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యం కాగా, 273 కోట్ల మొక్కలు అధికారుల కృషి, ప్రజల భాగస్వామ్యంతో నాటి సంరక్షించడం జరిగిందని తెలిపారు. మొక్కల సేకరణకు జిల్లాలో నర్సరీలను ఏర్పాటు చేయడం, అవసరమైన మొక్కలు పెంచడం జరిగి, ఆయా ప్రాంతాలలో పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలు నాటి సంరక్షించడం జరుగుతున్నదని తెలిపారు. పర్యావరణాన్ని సమతుల్యం చేయడానికి, అడవులను పూర్వ వైభవం తీసుకురావడానికి చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు. స్థానిక సంస్థలలో 80 శాతం మొక్కలు సంరక్షించడానికి చట్టం రూపొందించడం జరిగిందని తెలిపారు. నిబద్ధత, సామాజిక స్పృహ, ముందు చూపుతో హరిత హారం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టారని తెలిపారు.ఆనంతరం జడ్పీ ఛైర్పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, ఆ కాలంలో అశోకుడు చెట్లు నాటాడని మనం పుస్తకాల్లో చదివాం, కానీ రాష్ట్రంలోని ప్రజలకు అవసరమైన పచ్చదనం అందించాలనే ముందు చూపుతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ హరితాహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి, 7.78 శాతం గ్రీనరీ కవరేజీ చేయడం జరిగిందన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమాల ద్వారా పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. జిల్లాలో 93 శాతం మొక్కలను సంరక్షించడం జరిగిందని జడ్పీ చైర్ పర్సన్ తెలిపారు.ఆనంతరం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, భావితరాల వారి జీవనానికి అవసరమైన వాయువు, నీరు అందించడానికి మొక్కల పెంపకం దోహదపడుతుందనీ అన్నారు. ప్రతీ గ్రామంలో నర్సరీలు ఏర్పాటు వేయడం, అవసరమైన మొక్కలు పెంచడం జరుగుతున్నాయని, గ్రీన్ ఆక్షన్ ప్లాన్ తో సుందరీకరణ పనులు చేపట్టడం, మొక్కలను సంరక్షించడం జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో 409 పల్లె ప్రకృతి వనాలు, 90 బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఏ కార్యక్రమం అయినా ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతాయని తెలిపారు. జిల్లాలో 13 ఎకరాలలో 10 బ్లాకుల్లో దశాబ్ది వనాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఆనంతరంసారంగాపూర్ లో జరిగిన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మేల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, సమగ్ర ఆలోచనలతో హరిత హారం పవిత్ర కార్యక్రమాన్ని రూపొందించి ప్రపంచంలోనే 3వ అతి పెద్ద ప్రయత్నమని అన్నారు. యాదాద్రి మాడల్ లో మొక్కలను పెంచడం జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు ప్రశంసా పత్రాలు, మెమొంటో లను అందించారు. ఈ కార్యక్రమాలలో ఆర్డీవో మాధురి, స్థానిక సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపిపి, ఇతర ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రతతో ఉత్తరప్రదేశ్‌లోని 54 మంది మృతి

లక్నోజూన్ – ప్రభాత సూర్యుడు : పెరిగిన అధిక ఉష్ణోగ్రతల మధ్య ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా జిల్లాలో 3 రోజుల వ్యవధిలో 54 మంది ప్రాణాలు కోల్పోగా.. 400 మంది ఆసుపత్రుల పాలయ్యారు. జూన్ 15న 23 మంది చనిపోగా.. 16న 20 మంది, 17న 11 మంది చనిపోయారు. అయితే ఈ మరణాలకు గల కారణాలపై అధికారులు భిన్న వివరణలు ఇచ్చారు. మొదటగా తూర్పు ఉత్తరపరదేశ్ జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు ఈ మరణాలకు అధిక ఉష్ణోగ్రతలే కారణమై ఉండొచ్చని చెప్పారు. అయితే ఈ మరణాలకు కారణాలు తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన విచారణ కమిటీ ఇన్‌చార్జ్, లక్నోకు చెందిన సీనియర్ ప్రభుత్వ వైద్యుడు ఏకే సింగ్.. మరణాలకు అధిక ఉష్ణోగ్రతలే కారణమనే విషయాన్ని తోసిపుచ్చారు.ఏకే సింగ్ మాట్లాడుతూ " ప్రాథమికంగా ఇవి అధిక ఉష్ణోగ్రతల వల్ల సంభవించిన మరణాలుగా కనిపించడం లేదు. ఎందుకంటే ఇలాంటి పరిస్థితులే బల్లియా సమీప జిల్లాలోనూ ఉన్నాయి. కానీ అక్కడ ఇలాంటి మరణాలు నమోదు కాలేదు. చనిపోయిన వారిలో ఎక్కువ మందికి మొదట ఛాతిలో నొప్పి వచ్చింది. కానీ అధిక ఉష్ణోగ్రతల వల్ల ప్రభావితమైన వారిలో ఛాతిలో నొప్పి రావడం మొదటి లక్షణం కాదు. అయితే ఈ మరణాలు నీటి వల్ల ఏమైనా సంభవించాయా లేదా ఇంకేమైనా కారణం ఉందా అనేది తేలడానికి దర్యాప్తు చేస్తాం. వాతావరణ విభాగం కూడా నీటి నమూనాలను తనిఖీ చేయడానికి వస్తోంది" అని ఆయన చెప్పారు.అంతకుముందు రోజు బల్లియా చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ ర్యాంక్ వైద్యుడు చాలా మరణాలు వడదెబ్బ కారణంగానే సంభవించాయని ప్రకటించాడు. దీంతో ఆ ప్రకటన వైరల్‌గా మారింది. అయితే సరైన సమాచారం లేకుండా అధిక ఉష్ణోగ్రతల వల్ల సంభవించే మరణాలపై నిర్లక్ష్యంగా ప్రకటన చేసినందుకు సదరు వైద్యుడిని విధుల నుంచి తొలగించినట్లు యూపీ ఆరోగ్య మంత్రి బ్రజేష్ పాఠక్ తెలిపారు. అంతేకాకుండా బల్లియాలో జరిగిన ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, అక్కడి పరిస్థితిని తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని బ్రజేష్ పాఠక్ చెప్పారు. అయితే ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే కారణమని ఉత్తర ప్రదేశ్ ప్రతిపక్ష నాయకుడు, సమాజ్‌వాద్ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అధిక ఉష్ణోగ్రతల గురించి ప్రభుత్వం ముందుగానే ప్రజలను హెచ్చరించాలి. గత 6 సంవత్సరాల్లో యూపీలో ఒక ప్రభుత్వ ఆసుపత్రి కూడా నిర్మించలేదు. చనిపోయిన వారిలో ఎక్కువ మంది పేద రైతులే ఉన్నారు. ఎందుకంటే వారికి సరైన సమయంలో ఆహారం, మందులు, వైద్యం అందలేదు." అని అఖిలేష్ యాదవ్ అన్నారు. ప్రస్తుతం బల్లియా జిల్లాలో రోగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో అందరికీ స్ట్రెచర్లు కూడా దొరకడం లేదు. చాలా మంది అటెండర్లు రోగులను తమ భుజాలపై మోసుకుంటూ అత్యవసర వార్డులకు తీసుకెళ్తున్నారు.

తమిళనాడులో దంచి కొడుతున్న భారీవర్షాలు

చెన్నై – ప్రభాత సూర్యుడు : తమిళనాడులో భారీవర్షాలు దంచి కొడుతున్నాయి. చెన్నైతో సహా పొరుగున ఉన్న జిల్లాల్లో రాత్రిపూట భారీ వర్షాలుకురుస్తున్నాయి. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, వెల్లూరు, రాణిపేట జిల్లాలను భారీవర్షాలు ముంచెత్తాయి. చెన్నైలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు విమానాలకు బెంగళూరుకు మళ్లించారు. చెన్నైనుంచి వెళ్లాల్సిన పలు విమానాలను రద్దు చేశారు.భారీ వర్షాల కురుస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించింది. చెన్నైతో సహా ఆరు జిల్లాల్లో పాఠశాలకు సోమవారం సెలవు ప్రకటించింది. మరోవైపు సోమవారం తమిళనాడులోని పలు ప్రాంతాల్లో తుఫాను ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.సోమవారం ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. నిన్న రాత్రి చెన్నై అంతటా విస్తారంగా భారీ వర్షాలు నమోదయ్యాయి. మీనంబాక్కం ప్రాంతంలో గడిచిన 24 గంటల్లో 137.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. సోమవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున చెన్నై సహా ఆరు జిల్లాల్లో పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది.. చెన్నైతో

సహా పొరుగున ఉన్న జిల్లాల్లో రాత్రిపూట భారీ వర్షాలుకురుస్తున్నాయి. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, వెల్లూరు, రాణిపేట జిల్లాలను భారీవర్షాలు ముంచెత్తాయి. చెన్నైలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు విమానాలకు బెంగళూరుకు మళ్లించారు. చెన్నైనుంచి వెళ్లాల్సిన పలు విమానాలను రద్దు చేశారు.భారీ వర్షాల కురుస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించింది. చెన్నైతో సహా ఆరు జిల్లాల్లో పాఠశాలకు సోమవారం సెలవు ప్రకటించింది. మరోవైపు సోమవారం తమిళనాడులోని పలు ప్రాంతాల్లో తుఫాను ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.సోమవారం ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. నిన్న రాత్రి చెన్నై అంతటా విస్తారంగా భారీ వర్షాలు నమోదయ్యాయి. మీనంబాక్కం ప్రాంతంలో గడిచిన 24 గంటల్లో 137.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. సోమవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున చెన్నై సహా ఆరు జిల్లాల్లో పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com